జాబ్ మేళాకు విశేష స్పందన

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మ్యూజిక్ బస్ ఫౌండేషన్స్, కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌ఆర్ సర్వీసెస్, స్కిప్పర్ మెట్టర్, ఇన్ఫ్రాసెస్, కోజెంట్, కోమెట్ స్టాఫింగ్, కనెక్ట్, యాప్ ట్రిక్స్ వంటి 12 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. 150 మంది ఇంటర్వ్యూలకు హాజరైతే 70మంది ఉద్యోగాలకు ఎంపిక య్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. శ్రీనివాస్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్, డా. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్‌ను కలిసిన సిల్ట్ కార్మికుల అసోసియేషన్

ముషీరాబాద్: ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు కృషి చేస్తున్న సిల్ట్ వాహన కార్మికుల సమస్యల పరిష్కారనికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం తెలంగాణ దళిత సిల్ట్ వాహన కార్మికుల అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాంచందర్, బాషపాక శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కీర్తనల గానం

నల్లకుంట: పాటలు రాసి, వాటికి స్వరాలు సమకూర్చి పాడగలిగే వ్యక్తిని 'వాగ్గేయ కారుడు'అంటారని శ్రీరామ గానసభ కోశాధికారి కొణికి సాయిశ్రీనివాస శర్మ చెప్పారు. సంగీతోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం జరిగిన కచేరిని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.సుతీర్థ్, ఎస్.రామమూర్తి ఆలపించిన కీర్తనలు ఆహుతులను మైమరిపించాయి. శుక్రవారం సాయంత్రం 5.45 గంటలకు బొమ్మరాజు గాత్ర కచేరి, ముప్పవరపు సింహాచల శాస్త్రిచే హరికథా గానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు జి.నాగరాజన్, ఉపాధ్యక్షుడు కేవీ.తిరుమలరావు, కేఎస్.ఆనంద్, కోశాధికారి పీవీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

కాచిగూడ: గోల్నాక డివిజన్ కృష్ణానగర్ బస్తీ మూసీ నది, నాలాకు అనుకుని ఉండటంతో స్థానికులు నిత్యం దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం నేత ఎం.మహేందర్ తెలిపారు. గురువారం స్థానికులతో కలిసి బస్తీలో పర్యటించి నాలా ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దోమల బెడద నిద్రలేకుండా చేస్తోందని అన్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నాలాలో పూడిక తీత పనులను పూర్తిగా చేపట్టకపోవడంతో దుర్వాసన వస్తోందని అన్నారు. మంచినీటి నల్లాల ద్వారా మురుగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. వచ్చే రెండు గంటల్లో ఒక గంట పాటు నల్లాల్లో మురుగు నీరే వస్తోందని ఆయన పేర్కొన్నారు. మంచినీటి సరఫరా జరిగే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.నందు, ఎన్.సుధాకర్, ఎం.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలుషితనీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

అంబర్‌పేట: వర్షకాలంతో పలు ప్రాంతాల్లో తలెత్తుతున్న కలుషిత నీటిసరఫరా, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి గురువారం జలమండలి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని డీడీ కాలనీ, మల్లికార్జున్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆమె జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. తరచూ తలెత్తే సమస్యలను శాశ్వత ప్రతిపాదికన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు, మేనేజర్ మజీద్‌లు ఉన్నారు.

రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన గడువుకు ముందే బీసీ రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డలోని మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్ల అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు ఆ పార్టీని భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను పెంచేదాక కాంగ్రెస్, బీజేపీలను వదిలే ప్రసక్తే లేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తలుచుకుంటే నెల రోజుల్లోనే బీసీ రిజర్వేషన్లు అమలు చేయవచ్చని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను పెంచే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. రిజర్వేషన్లు పెంచే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు పి.కృష్ణ, భూషణ్ భాస్కర్, డా.ప్రశాంత్ నిమ్కర్, ముత్యాలరావు, ప్రదీప్‌గౌడ్, సత్యప్రకాష్ సింగ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం.!

ఈస్ట్ జోన్ డీసీపీ డా. బాలస్వామి



కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి

కాచిగూడ: 'డ్రగ్స్ మహమ్మారి విస్తరించకుండా తరిమేద్దాం.. వాటికి బానిసైతే జీవితం నాశనమవుతుంది..'అంటూ కాచిగూడ, నారాయణగూడలో విద్యార్థులు, యువత నినదించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గురువారం పలుచోట్ల వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. యువత అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు.

చదువుపై దృష్టి సారించాలి: డీసీపీ

డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టడం యువత వల్లే సాధ్యమని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి అన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ బాలస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధికి కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు మాదకద్రవ్యాలు, గంజాయి చాక్లెట్ రూపంలో అమ్ముతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు ఫోన్ నెంబర్ 100 లేదా 112 ద్వారా పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రాథమిక స్థాయిలో డ్రగ్స్ నిరోధించడంలో విద్యార్థులు కీలక పాత్ర వహించాలని ఆయన చెప్పారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేయాలి...

అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య మాట్లాడుతూ... డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులు డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడతారని చెప్పారు. సమాజాన్ని కుటుంబాన్ని నష్టపరిచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మనందరం యుద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నగరంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమవంతు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ ఏసీపీ వై.హరీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ తల్లోజు జ్యోత్స్న, యునైటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎల్.శ్రీలత, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ వీరేశం, కాలేజీ లెక్చరర్లు గీతాబాయి, పి.ప్రసాద్‌రావు, డాక్టర్ బి.లక్ష్మయ్య, లక్ష్మణ్ నాయక్, అనిల్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అరికట్టేందుకు యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యం



బర్కత్‌పురలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న రెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులు

మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాల కెమిస్ట్రీ, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సహకారంతో డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దామని కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) కకారులు, కళాశాల లెక్చరర్స్, విద్యార్థినులు, వివిధ విభాగాధిపతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా యువతలో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. మత్తుపదార్థాలు లేని జీవనశైలి గురించి సందేశాలను ఇచ్చే ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. మాదకద్రవ్య వినియోగాన్ని అరికట్టేందుకు యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. అవగాహన అనేది నివారణకు మొదటి అడుగని నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోపాల్ సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొని ప్రసంగించారు. మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రమాణం చేశారు. ప్రజలకు అవగాహన కోసం కరపత్రాలు, సమాచార పత్రికలను పంపిణీ చేశారు.

రంగానగర్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

ముషీరాబాద్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. యాంటీ డ్రగ్స్ డేను పురస్కరించుకుని సొసైటీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్(ఎస్‌ఆర్‌డీ) సంస్థ ఆధ్వర్యంలో గురువారం రంగానగర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వాడితే ఆరోగ్య పరంగా.. చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ ఆలీ, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి డ్రగ్స్‌ను దూరం చేద్దాం

అన్ని రకాల డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ... సమాజానికి డ్రగ్స్‌ను దూరం చేద్దామని చిక్కడపల్లి ఏసీపీ రమేష్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వరల్డ్ డ్రగ్ డేను పురస్కరించుకొని గురువారం రాంనగర్ సెయింట్ ఫ్రాన్సిస్ హై స్కూల్‌లో 8, 9, 10వ తరగతి విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ... నేడు యువత మత్తుకు చిత్తు అవుతుందని విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సెయింట్ ఫ్రాన్సిస్ హై స్కూల్‌లో మాట్లాడుతున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్

ఏ లక్ష్యం కోసం ఉద్యమం చేశామో అది నేరవేరలేదు!



ఉద్యమకారుల సదస్సులో అభివాదం చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

- జస్టిస్ చంద్రకుమార్
- ఉద్యమకారులను ఆదుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం

సుందర య్య విజ్ఞాన కేంద్రం: ఏ లక్ష్యం కోసం తెలంగాణ ఉద్యమం చేశామో రాష్ట్రం ఏర్పడ్డాక ఆ లక్ష్యం నేరవేరలేదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. అమరవీరుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. త్యాగాలు చేసిన కుటుంబాలకు ఏ దిక్కు లేకుండా పోయిందన్నారు. ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మన నిధులు.. మన ఉద్యోగాలు.. మన నీళ్ల మనకు కావాలని... ఉద్యమాలు చేశామన్నారు. ఈ లక్ష్యం ఇంకా నెరవేరలేదని అన్నారు. వివక్ష, అణిచివేత, వెట్టిచాకిరి లేని సమాజ నిర్మాణం కోసం పోరాడాలన్నారు. ఉచిత విద్య, వైద్యం, ప్రజలకు అందాలనేదే ఉద్యమకారుల ఆశయమని అన్నారు. – పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. ఇప్పుడున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తారనే నమ్మకం లేదన్నారు. ఒక్క అమరుడి కుటుంబాన్ని కూడా ఇప్పటికీ గుర్తించలేదని చెప్పారు. అమరుల కుటుంబాలతో మాట్లాడాటానికి సీఎం సిద్ధంగా లేరని ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తనతో అన్నారని స్పష్టం చేశారు. ఓటు చైతన్యం ప్రజల్లో రానంతవరకు దుర్మార్గులు జరుగుతునే ఉంటాయి అన్నారు. కోలా జనార్ధన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ చెరుకు సుధాకర్, మాజీ ఎంపీ అజిజ్ బాషా, విమలక్క, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.


ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి శాంతి చర్చలు జరపాలి



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయికులు

కవాడిగూడ: మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌తో వందలాది మంది ఆదివాసీలు బలవుతున్నారని... దీనిని వెంటనే నిలిపేసి శాంతి చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. టెర్రరిస్టులతో చర్చలకు సిద్ధపడ్డ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపకపోవడం సిగ్గుచేటన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడుతూ, అడవులలో ఉన్న ఖనిజ సంపదను కాపాడుతున్న మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చందునాయక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రమోహన్‌గౌడ్, నెర్లకంటి శ్రీకాంత్, ధర్మేంద్ర, సత్యప్రసాద్, అనిల్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కిషన్, కళ్యాణ్ పాల్గొన్నారు.

అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మిద్దాం



ఎమర్జెన్సీ వ్యతిరేక సభలో మాట్లాడుతున్న న్యూ డెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో 50 సంవత్సరాల 'నాటి ఎమర్జెన్సీ – నేటి సమకాలీన పరిస్థితి'అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి న్యూ డెమాక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్‌రావు, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు ప్రదీప్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. అలహాబాద్ హైకోర్టు ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ అప్రజాస్వామికంగా ఎమర్జెన్సీ పెట్టారన్నారు. ఎమర్జెన్సీలో అన్ని పార్టీల నాయకులను మీసా చట్టం కింద అరెస్టు చేసిందని పేర్కొన్నారు. వేలాది మంది విప్లవకారులను పట్టుకుని కాల్చిచంపారన్నారు.

◆ నాడు దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించి పౌర, ప్రజాస్వామిక హక్కులను హరిస్తే నేడు బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం అప్రకటింగా దేశంలో ఎమర్జెన్సీ విధించారన్నారు. సీబీఐ, ఈడీ వంటి సంస్థలను ప్రతిపక్ష నాయకులపై ప్రయోగిస్తున్నారని పేర్కొన్నారు. మధ్య భారతంలో ఉన్న అపారమైన కనిజ సంపదను అంబానీ, ఆదానీలకు ఇవ్వడానికి ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తున్నారని అన్నారు. మోదీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ ప్రజా ఉద్యమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. న్యూడెమాక్రసీ కార్యాదర్శి జి.ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు అరుణ, శివబాబు, పి.మహేష్, కె.శ్రీనివాస్, మంద నవీన్, తీగల శ్యామ్, మనెమ్మ, భారతి, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోండి



టూర్ ప్యాకేజీ పోస్టర్‌ను కార్పొరేటర్‌కు అందజేస్తున్న బర్కత్‌పుర డీఎం మంజులరెడ్డి

కాచిగూడ: ఆర్టీసీ బర్కత్‌పుర డిపో ఆధ్వర్యంలో 5 పుణ్యక్షేత్రాల ఒక రోజు టూర్ ప్యాకేజీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. బర్కత్‌పుర డీఎం ఆర్.మంజులరెడ్డి, డిపో అధికారులు, సిబ్బంది గురువారం కార్పొరేటర్‌కు టూర్ ప్యాకేజీ పోస్టర్, కరపత్రాలను అందజేశారు. శ్రీరంగపురం, సోమశీల ప్రాజెక్టు, జోగులాంబ టెంపుల్, బీచ్‌పల్లి హనుమాన్ టెంపుల్, జూరాల ప్రాజెక్టు క్షేత్రాలకు, చిలుకూరు బాలాజీ టెంపుల్, అనంతగిరి హిల్స్ టూర్ ప్యాకేజీని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ప్రతినిధులు మిథున, జయలక్ష్మి, లక్ష్మణ్, మాధవ్, జగదీష్, బీజేపీ నేతలు రమేష్, మహబూబ్, రూప్‌కిరణ్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఓంప్రకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ నేత అయోధ్య రాములు మృతి



అంబర్‌పేట: బీజేపీ సీనియర్ నాయకుడు, ఓబీసీ మోర్చా అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు అయోధ్య రాములు గుండె పోటుతో మృతి చెందారు. బుధవారం గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు సమీప ఆస్పత్రికి తరలించేలోపే ఆయన తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సెంట్రల్ జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు గౌతంరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్లు ఉమా రమేష్‌యాదవ్, అమృత, నాయకులు కృష్ణగౌడ్, అజయ్‌కుమార్, నాగభూషణంచారి, నరేష్‌గౌడ్, భిక్షపతి, యస్వంత్, నవీన్‌రెడ్డి తదితరులు హాజరై ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ముషీరాబాద్: కాలుష్య రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలని దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ కోరారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనను పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్‌కుమార్, ఆర్.విశ్వం, బిజ్జి కనకేష్‌కుమార్, రాజశేఖర్, బబ్లూ, శివ, కృష్ణ, నిత్యానంద్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నందగిరి నర్సింహ తదితరులు

14ఏళ్ల న్యాయ పోరాటం.. దక్కిన నష్టపరిహారం

- ఎన్టీపీసీ టెక్నీషియన్ ప్రభాకర్‌రావు భార్యకు రూ.1.34కోట్ల చెక్కు అందజేత
- అధిక మొత్తంలో నష్టపరిహారం అందడం ఇదే తొలిసారని: న్యాయవాది



పిటిషనర్, న్యాయవాది సమక్షంలో బాధితురాలు రేవతికి చెక్కును అందజేస్తున్న ఏసీఎల్ ప్రభావతి

చిక్కడపల్లి: నష్టపరిహారం కోసం 14 ఏళ్లుగా న్యాయం పోరాటం చేస్తున్న బాధితురాలికి న్యాయం జరిగింది. ఎట్టకేలకు గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో రూ.1,34,78,269 చెక్కును సహాయ కమిషనర్-3 (ఏసీఎల్) ప్రభావతి పిటిషనర్ న్యాయవాది ఇంద్రసేనారెడ్డి, రిప్రజెంటేటివ్ ఎ.వెంకటేశ్వర్‌రావుల సమక్షంలో బాధితురాలు రేవతికి చెక్కును అందజేశారు. ఎన్టీపీసీ రామగుండంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తూ మార్చి నెల 20210లో చాట్రగడ్డ ప్రభాకర్‌రావు గుండెపోటుతో మరణించారు. విధి నిర్వహణలో చనిపోయినా ఎన్టీపీసీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించకపోవడంతో మృతుడి భార్య రేవతి 2012లో కరీంనగర్ కార్మికశాఖలో కేసు వేశారు. 2019లో కేసు హైదరాబాద్ ఏసీఎల్-3కి బదిలీ అయ్యింది. వాదోపవాదాలు, సాక్ష్యాలను పరిశీలించిన అప్పటి ఏసీఎల్ జాసన్ 2024లో రేవతి కేసులో ఎన్టీపీసీ రూ.47,66,100నష్టపరిహారం చెల్లించాలని, 2019 మార్చి తేదీ నుంచి 12 శాతం వడ్డీతో చెల్లించాలని ఆర్డర్ ఇచ్చారు. ఇచ్చిన ఆర్డర్ ప్రకారం మొత్తం నష్టపరిహారంగా రూ.1,34,78,269 చెక్కును గురువారం అందజేశారు. కార్మికుడికి అధిక మొత్తంలో నష్టపరిహారం అందడం ఇదే తొలిసారని న్యాయవాది ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కార్మికశాఖ, న్యాయవాదులు, ట్రేడ్ యూనియన్ నేతలు కార్మికుడి కుటుంబానికి న్యాయం జరగడంపై హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



గోల్నాకలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: మౌలిక సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం అధికారులను ఆదేశించారు. గోల్నాకలో పాదయాత్ర చేపట్టి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, కలుషిత తాగునీటి సరఫరా, అంతర్గత రోడ్ల అధ్వానం వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు దృష్టికి తీసుకొచ్చారు. సమస్య తలెత్తినప్పుడు పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని అన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

అంధుల విద్యాభివృద్ధికి 'జ్ఞానజ్యోతి' ఓ మైలురాయి

- అందుబాటులోకి బ్రెయిలీ లిపి పుస్తకాలు
- పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అంధ విద్యార్థుల కోసం ఎన్‌వీడీఏ సాఫ్ట్‌వేర్



చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో జ్ఞానజ్యోతి విభాగాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్

చిక్కడపల్లి: అంధుల విద్యాభివృద్ధికి గ్రంథాలయ వ్యవస్థ ప్రత్యేకంగా కృషి చేస్తున్నందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ అన్నారు. చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో జ్ఞానజ్యోతి పేరుతో అంధులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కదిరవన్‌తో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రారంభించిన 'జ్ఞానజ్యోతి విభాగం'ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ విభాగంలో 1 నుంచి 10వ తరగతి వరకు ఎపుస్తకాలు, మహాభారతం, రమాయణం, భగవద్గీత, కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు బ్రెయిలీ లిపిలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అంధ విద్యార్థులకు ఎన్‌వీడీఏ (నాన్ విజువల్ డెస్క్‌టాప్ యాక్సెస్) సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. అంధుల విద్యలో జ్ఞానజ్యోతి ఓ మైలురాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి పద్మజ, దేవనార్ అంధుల పాఠశాల చైర్మన్ సాయిబాబా, ఉద్యోగులు చంద్రకళ, అవినాష్, వెంకటేశ్వర్‌రెడ్డి, కిష్టారెడ్డి, ప్రతిభారెడ్డి, వెంకటేష్‌యాదవ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌ను చుట్టుముట్టిన నిరుద్యోగులు

60వేల ఉద్యోగాలు ఎవరికిచ్చారని నిలదీత



చిక్కడపల్లి: గ్రంథాలయంలో జ్ఞానజ్యోతి విభాగాన్ని ప్రారంభించిన అనంతరం బయటకు వచ్చిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్, నగర చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డిని నిరుద్యోగులు చుట్టుముట్టి నిలదీశారు. ఉద్యోగ ప్రకటనల విడుదలలో జాప్యంపై ప్రశ్నించారు. జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం 60వేల ఉద్యోగాలు ఎవరికిచ్చారని ప్రశ్నించారు. రేపు (శుక్రవారం) మధ్యాహ్నం 12 గంటలకు గాంధీభవన్‌కు రావాలని రియాజ్ వారికి సూచించారు. అక్కడకు వచ్చినా "మీ మాటే మేము వినాలి... మా మాట వింటారా?" అని ఎదురు ప్రశ్నించే సరికి గాంధీభవన్‌కు రావాలని కారు ఎక్కి వెళ్లిపోయారు.